



పెద్దమండ్యం మండలంలో ఉపాధి పనులకు హాజరైన కూలీలు

కూలి రాలేదు..!

- రెండు నెలల నుంచి పెండింగ్
- పండగల వేళ కూడా పస్తులేనా..?
- జిల్లాలో రూ.34.27 కోట్ల బకాయిలు
- ఉపాధి కూలీల ఎదురుచూపులు

జిల్లాలో పేదలకు ఉపాధి హామీ పనులు ఎంతో ఆసరాగా ఉంటున్నాయి. అలాంటి ఉపాధి పనులకు వెళ్లే కూలీలకు రెండు నెలలుగా ప్రభుత్వం నుంచి కూలి రాలేదు. దీంతో పేదలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేసిన 15 రోజులకు ఒకసారి డబ్బులు కూలీల అకౌంట్‌లోనే పడుతుండేవి. అలాంటి రెండు నెలలైనా పైసా కూడా పడకపోవడంతో అప్పులు చేసి ఇల్లు గడపాల్సి వస్తోందని వాపోతున్నారు. ఉగాది, రంజాన్ పండగలు వస్తున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం మా కూలి ఇవ్వాలని కోరుతున్నారు.

మదనపల్లె టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు రెండు నెలలుగా వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని 19 కరువు మండలాల్లో పేదలు ఎక్కువగా ఉపాధి హామీ పనులకు వెళుతున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలలకు సంబంధించి వేతనాలు చెల్లించకపోవడంతో కూలీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మరో నెల వేతనాలు అందకుంటే వలస వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మెటీరియల్ కాంపొనెంట్‌తో పాటు కూలీలకు ఇచ్చే వేతనాలు కలిపి జిల్లాలో రూ.34.27 కోట్లు పెండింగ్ ఉంది.

జిల్లాలో 35 వేల మందికి ఉపాధి

జిల్లాలోని 30 మండలాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద 35 వేల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. గ్రామాల్లో ఉపాధి పథకం కింద కూలీలు ఫారంపాండ్స్, సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు, ట్రెంచ్ వర్క్స్, సరిహద్దు ట్రెంచ్‌లు, ఉద్యానవనాల్లో మొక్కలకు పాదులు తీయడం, పశువులకు నీటి గుంతలు తవ్వడం పనులు చేస్తున్నారు. వీరికి పనులను బట్టి రోజుకు రూ.261 నుంచి రూ.300 వరకు కూలీ మొత్తం చేతికందాలి. 30 మండలాల్లో 35 వేల మంది కూలీలకు ప్రతి రోజు ఎంత లేదన్నా 20 వేల మంది కూలీ పనులకు వెళితే రోజుకు సరాసరిన రూ.52.20 లక్షల వేతనాలు చెల్లించాల్సి ఉంది.

పండగల వేళ కూడా పస్తులేనా..?

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు జనవరి నెల 13వ తేదీ ఆఖరు బిల్లులు చెల్లించారు. అప్పటి నుంచి నేటి వరకు 60 రోజులవుతున్నా కూలీలకు ప్రభుత్వం డబ్బులు చెల్లించలేదు. కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం కలిపి ఉపాధి కూలీలకు చెల్లించాలి. కానీ ఇంతవరకు కూలీలకు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఉపాధి కూలీలకు నేటి వరకు రూ.6,08,22,090, మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.28,19,18,176 మొత్తం కలిపి రూ.34,27,40,266 చెల్లించాల్సి ఉంది. ముఖ్యంగా పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా రెండు నెలల్లో గ్రామాల్లో సీసీ రోడ్లు, మినీ గోకులాలు, ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీల నిర్మాణాలు జరిగాయి. చాలా మంది ఏజెన్సీ నిర్వాహకులు అప్పులు చేసి సిమెంటు తదితర వస్తువులను కొనుగోలు చేసి, ఉపాధి హామీ పథకం కింద పనులు పూర్తి చేశారు. ఇప్పుడు రెండు నెలలైనా బిల్లులు చెల్లించకపోవడంతో అటు ఉపాధి కూలీలు, ఇటు ఏజెన్సీల నిర్వాహకులు అప్పులు చేసి కుటుంబాలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఉగాది, రంజాన్ పండగల సీజన్ కావడంతో చేతిలో చిల్లిగవ్వ లేక ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారు.



మదనపల్లె మండలంలో కాలువలో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

పండుగొస్తోంది..కూలి లేకుండా ఎట్లా...



శివరాత్రి పండగకు కూలి డబ్బులు రాలేదు. ఇప్పుడు ఉగాది పండగ వస్తోంది. రెండు నెలల కూలి ఇవ్వకుంటే ఎట్లా గడిపేది. అప్పులు చేసి సంసారం సాగిస్తున్నాం. ఇట్లే ఉంటే ఉపాధి పనులకు వెళ్లకుండా వేరే పనులకు పోతాము. ఆఫీసర్లేమో అద్దో, ఇద్దో డబ్బులు వస్తాయంటున్నారు. ఎన్ని రోజులు ఎగబడి చూడాలి.

- పుష్ప, ఉపాధి కూలి, రామాచార్లపల్లె, మదనపల్లె మండలం.

చేతులు కాయలు కాచాయే గాని డబ్బులు రాలేదు



పనులు చేతులు కాయలుకాచేయేగాని కూలి రాలేదు. రెన్నెల్లు కష్టం కంటికి కనబడలేదు. వున్నకాటికి బియ్యం, పప్పులతో రెన్నెల్లు గడిపేశాం. డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలీదు. ఇంతకు ముందు లాగా వలసెల్లిపోయే ఆగత్యం రాకుండా పెబుత్వం మాకు డబ్బులు ఇవ్వాలి

- సాలమ్మ, ఉపాధి కూలి, బండకింద తాండా, పెద్దమండ్యం మండలం

వారం రోజుల్లో బిల్లులు వస్తాయి

కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే సమస్య ఉంది. జనవరి 13వ తేదీ వరకు ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించాము. మెటీరియల్ కాంపొనెంట్ బిల్లులు చెల్లించాల్సి ఉంది. బడ్జెట్ కేటాయిస్తూనే అందరికీ బిల్లులు చెల్లించేస్తాం.

- వెంకటరత్నం, పీడీ, డ్వామా

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రాధాన్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



ల్యాప్‌టాప్‌లు అందుకున్న విద్యార్థులతో కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డిగ్రీ, అపై తరగతులు చదువుతున్న ఆరుగురు విభిన్న ప్రతిభావంతులకు కలెక్టర్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. అలాగే జాతీయ దివ్యాంగుల ఆర్థిక, అభివృద్ధి పథకం (ఎన్‌హెచ్ఎఫ్‌డీసీ) ద్వారా టెంట్ హౌస్ వ్యాపారంతో స్వయం ఉపాధి పొందడం కోసం షేక్ జిలానీ అనే విభిన్న ప్రతిభావంతుడికి మంజూరు చేసిన రూ.5 లక్షల రుణం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల విద్యాభివృద్ధి, స్వయం ఉపాధి, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఆర్‌వీ క్రిష్ణకిశోర్, సిబ్బంది, లబ్ధిదారుల తల్లిదండ్రులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- 228 అర్జీలను స్వీకరించిన కలెక్టర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 228 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్లకు, ఎంపీడీవోలనుహెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో మధుసూదన్‌రావు, ఎస్‌డీసీ రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అందిన కొన్ని విజ్ఞప్తులు

నందలూరు మండలానికి చెందిన సుబ్రమణ్యం తాను వికలాంగుడినని ఈ మధ్యనే పింఛన్ ఆపేశారని తనకు పింఛన్ వచ్చే విధంగా చేయాలని కలెక్టర్‌ను కోరారు. కేవీపల్లి మండలం మోటుపల్లి వారి గ్రామానికి చెందిన అలివేలు నిరుపేదరాలైన తాను పాఠశాలలో ఆయాగా పనిచేసే దానినని, ఈ మధ్యనే తనను ఆ పోస్టు నుంచి తొలగించారని ఆ పోస్టులో వేరే వాళ్లను నియమించారని తనను తిరిగి నియమించాలని కోరింది.

హుండీ ఆదాయం రూ.15.43 లక్షలు



హుండీ డబ్బులను లెక్కిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : గంగమ్మజాతర హుండీ ఆదాయం 15,43,302 రూపాయలు వచ్చినట్లు ఈవో శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 1, 2 తేదీల్లో జరిగిన జాతర రెండు రోజుల ఆదాయం లెక్కించినట్లు ఆయన తెలిపారు. సోమవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో హుండీలు, దర్శన టికెట్ల ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. అలాగే బంగారు 11.100 గ్రాములు, వెండి 192.880 గ్రాములు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, సేవా బృందం పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



నడవలేని స్థితిలో వచ్చిన బాధితుడి సమస్యను తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి పలు సమస్యలపైన వచ్చిన ప్రజల నుంచి ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలపై ముఖాముఖి మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. మదనపల్లి మండలం కోళ్లబైలు గ్రామం నుంచి వచ్చిన సల్లావుద్దీన్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నడవలేని స్థితిలో ఉండగా తనను తీసుకుని తన కుటుంబ సభ్యులు ఎస్పీని కలిసేందుకు వచ్చారు. తాను టీవీఎస్‌లో వెళ్తుండగా ఎదురుగా బైక్‌పై వస్తున్న వ్యక్తి ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డానని, తనకు నష్టపరిహారం, ఆసుపత్రి ఖర్చులు ఇప్పించేలా సహాయం చేయాలని ఎస్పీని వేడుకున్నారు. సల్లావుద్దీన్ సమస్యను పరిష్కరించాలని మదనపల్లె ఒకటవ పట్టణ సీఐకి ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. అలాగే నందలూరు నాగిరెడ్డిపల్లె నుంచి వచ్చిన ఎస్.హుస్సేన్‌బాషా కాలు విరగడంతో ఇబ్బంది పడుతూ ఉండగా తన దగ్గర వైద్యం కోసం దాచుకున్న డబ్బులను పరియస్తుడైన వ్యక్తి తీసుకుని ఇవ్వడం లేదని, డబ్బులు ఇప్పించేలా న్యాయం చేయాలని ఎస్పీని కోరాడు. సమస్యను పరిష్కరించాలని నందలూరు ఎస్ఐకి ఆదేశాలు జారీ చేశారు. ఎండలు మొదలు కావడంతో ఫిర్యాదుదారులకు ఇబ్బందులు కలగకుండా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు మజ్జిగ పంపిణీ చేశారు.

జాతీయ సమావేశాలకు జాండ్ల సర్పంచ్

- ఢిల్లీకి పయనం



జాండ్ల సర్పంచ్ నీలిమ

పీలేరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బుధ, గురువారాల్లో జరగనున్న జాతీయ మహిళా ప్రజాప్రతినిధుల సదస్సుకు పీలేరు మండలం జాండ్ల సర్పంచ్ నీలిమ ఎంపికయ్యారు. ఈ మేరకు వర్తమానం అందడంతో ఆమె బుధవారం ఢిల్లీకి బయలుదేరారు. ఐక్యరాజసమితి, కేంద్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న మహిళా ప్రజాప్రతినిధుల సాధికార సదస్సులో ఆమె జిల్లా ప్రతినిధిగా పాల్గొననున్నారు.

సత్య ప్రమాణాలకు నెలవు..

తరిగొండ లక్ష్మీనరసింహాలయం

- బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ
- టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి







ఆలయంలో వెలసిన స్వామివారు, వెంగమాంబ

గుర్రంకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సత్య ప్రమాణాలకు నెలవైన తరిగొండ లక్ష్మీనరసింహాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఆలయంలోని స్వామి వారిని దూర్వాస మహాముని ప్రతిష్ఠించడంతో పాటు, ఆలయంలో ధర్మపీఠాన్ని నెలకొల్పి, ఇక్కడ అసత్య ప్రమాణం చేస్తే వారి వంశం నిర్వంశం అవుతుందని శపించారని స్థానికులు చెబుతున్నారు. అలాగే తరిగొండ వెంగమాంబ స్వస్థలం కావడంతో టీటీడీ ప్రతి ఏటా స్వామి వారి బ్రహ్మోత్సవాలను పది రోజుల పాటు అంగరంగా వైభవంగా నిర్వహిస్తోంది. బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

కుడి ప్రసాదాల పంపిణీ...

బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు ధ్వజారోహణం రోజున సంతానం లేని మహిళలకు వేద పండితులు కుడి ప్రసాదం (సంతాన ప్రసాదం) పంపిణీ చేస్తారు. ఈ ప్రసాదం తింటే సంతానం కలుగుతుందని భక్తుల అపార నమ్మకం. దీంతో సంతానం లేని మహిళలు ఆలయంలో వరపడడానికి అధిక సంఖ్యలో వస్తారు.

బ్రహ్మోత్సవాల వివరాలు..

టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ బ్రహ్మోత్సవాల్లో మార్చి 5న సాయంత్రం అంకురార్పణ, 6వ తేదీ ఉదయం ధ్వజారోహణం, రాత్రి హంస వాహనం, 7న ఉదయం ముత్యపు పందిరి వాహనం, రాత్రి హనుమంత వాహనం, 8న ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సింహవాహనం, 9న ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి పెద్ద శేషవాహనం, 10న ఉదయం తిరుచ్చి ఉత్సవం, రాత్రి గజవాహనం, 11న ఉదయం సర్వభూపాల వాహనం, రాత్రి కల్యాణోత్సవం, గరుడసేవ, 12న ఏడవ రోజు ఉదయం రథారోహణం, ధూళి ఉత్సవం, 13న ఎనిమిదో రోజు ఉదయం సూర్యప్రభ, సాయంకాలం చంద్రప్రభ వాహనం, పార్వేట ఉత్సవం, ఆశ్వ వాహనం, 14న ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, 15న పదో రోజు ఉదయం స్నపన తిరుమంజనం, సాయంత్రం పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి


ట్రిపుల్‌ఐటీ తాత్కాలిక అధ్యాపకుల నిరసన

- 110 జీవో ప్రకారం వేతనం ఇవ్వాలని డిమాండ్



7

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం)	సెహరీ (బుధవారం ఉదయం)
రాయచోటి	6.28	5.09
మదనపల్లె	6.30	5.16
రాజంపేట	6.26	5.17
పీలేరు	6.28	5.09

ఎన్‌ఏటీఎస్‌కు విశేష స్పందన

● పట్టణ ఎస్‌హెచ్‌జీ పట్టభద్రులకు శిక్షణ ● అప్రెంటిషిప్‌లకు దరఖాస్తుల వెల్లువ ● లక్ష్యం 2150... దరఖాస్తులు 2986


దరఖాస్తులు స్వీకరిస్తున్న మెప్మా సిబ్బంది (ఫైల్)

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న జాతీయ అప్రెంటిషిప్ శిక్షణ పథకం(ఎన్‌ఏటీఎస్)కు విశేష స్పందన లభిస్తోంది. ఈ పథకం ద్వారా నగర, పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల్లో 2021 తర్వాత పట్టభద్రులైన సభ్యులు, వారి పిల్లలకు వృత్తి నైపుణ్య, జీవన నైపుణ్య శిక్షణ అందించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), ఆశా సొసైటీ సహకారంతో 2024-25 సంవత్సరానికి అప్రెంటిషిప్ ద్వారా లబ్ధి చేకూర్చేందుకు ఒప్పందం చేసుకుంది.

జిల్లాలోని కడప నగరంతో పాటు జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేలు, మైదుకూరు, ఎర్రగుంట్ల, కమలాపురం పట్టణాల్లో 2,150 మంది డిగ్రీ చదివిన స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు, వారిపిల్లలకు అవసరమైన వృత్తి జీవన నైపుణ్య శిక్షణ అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ప్రస్తుతం ఎటువంటి ఉద్యోగం ఉపాధి లేకుండా ఇంట్లో ఖాళీగా ఉన్నవారు అర్హులుగా పరి గణించారు. దీంతో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్య అర్హత ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డు, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ ఫోన్ నెంబర్, బ్యాంకు ఖాతా, ఇ-మెయిల్ ఐడీలాంటి వివరాలతో దరఖాస్తులను స్వీకరించారు. ఈదరఖాస్తులు మెప్మా ఎస్ఎ ల్ఎఫ్ ఆర్పీ, కమ్యూనిటీ ఆర్గనైజర్ ద్వారా వెబ్‌సైట్‌లో నమోదు చేశారు.

లక్ష్యానికి మించి దరఖాస్తులు

ప్రభుత్వం కడప జిల్లాకు సంబంధించి 2150 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించింది. కానీ క్షేత్రస్థాయిలో 2986 మంది దరఖాస్తులను సమర్పించారు. బద్వేలు పట్టణ ప్రాంతంలో 300 మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉండగా 362 మంది, జమ్మలమడుగులో 150 మందికి 183 మంది, కడప నగరంలో 500 మందికి 940 మంది, ప్రొద్దుటూరు పట్టణంలో 300 మందికి 462, పులివెందులలో 300 మందికి 339 మంది, మైదుకూరులో 300 మందికి 368 మంది, ఎర్రగుంట్లలో 150 మందికి 160 మంది, కమలాపురంలో 150 మందికి గాను 172 మంది దరఖాస్తులు సమర్పించారు.

ప్రయోజనాలు ఇవే...

శిక్షణ అనంతరం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ, సంబంధిత పరిశ్రమ నుంచి ధ్రువపత్రాలు జారీ చేస్తారు. వీటి ఆధారంగా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. అదేవిధంగా శిక్షణ కంపెనీ లేదా ఏడాది పాటు ప్రతినెల రూ.4500 ఉపకారవేతనం అందజేయడం జరుగుతుంది.

దరఖాస్తులకు మంచి స్పందన

ఎన్‌ఏటీఎస్ అప్రెంటి షిప్‌కు సంబంధించి దరఖాస్తులు స్వీకరిం చాం. లక్ష్యానికి మించి దరఖాస్తులు అం దాయి. డిగ్రీ రెగ్యులర్ మోడ్‌లో ఉత్తీర్ణు లైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగింది.

-ఎం.కిరణ్‌కుమార్, పీడీ మెప్మా

ట్రిపుల్‌ఐటీ తాత్కాలిక అధ్యాపకుల నిరసన

● 110 జీఓ ప్రకారం వేతనం ఇవ్వాలని డిమాండ్


అకడమిక్ బ్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న తాత్కాలిక అధ్యాపకులతో చర్చిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో విద్యాబోధన చేస్తున్న తాత్కాలిక అధ్యాపకులు క్యాంప స్‌లో రోడ్డెక్కారు. ఏడేళ్లుగా పనిచేస్తున్న అరకొర వేతనమే ఇస్తున్నారని.. 110 జీఓ అమలు చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం ట్రిపుల్‌ఐటీ ఓల్డ్ క్యాంపస్ సమీపంలో ఉన్న ఆర్జీయూకేటీ ఎంబ్లమ్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. గెస్ట్‌ఫ్యాకల్టీ నుంచి కాంట్రాక్టు అధ్యాపకులుగా మార్చి 110 జీఓ ప్రకారం రూ.33వేల వేతనం, ఏడాదికి రూ.1000 ఇన్సెంటివ్ జమ చేసి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రతినిధి నజీర్ ఏడేళ్లుగా పనిచేస్తున్నా తమకు ఆర్జీ యూకేటీ తమకు తీరని అన్యాయం చేస్తోందని, చాలీచాలనీ జీతంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్త ధర్నా చేస్తున్న తాత్కాలిక అధ్యాపకులతో చర్చించారు. సమస్యను రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లి పలు మార్లు డైరెక్టర్ నచ్చజెప్పినా నిరసన కొనసాగించారు. సాయంత్రం రిజిస్ట్రార్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. సాంకేతిక విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో జరగబోయే గవర్నింగ్ కౌన్సిల్ మీటింగ్‌లో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను తాత్కాలికంగా విరమించారు.

ఇష్టానుసారం పదోన్నతులు.. ఖాళీలు లేకున్నా పోస్టింగులు

● కడప పూర్వ వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ నిర్వాకం
● ఆలస్యంగా గుర్తించి విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

కలికిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పర్యవేక్షణ గాలికొదిలేసిన కారణంగా అన్ని స్థాయిల్లోనూ అధికారులు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఉదంతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. వివిధ శాఖల్లో అధికారులు అన్ని రకాల నియమాలను తుంగలో తొక్కి. అక్రమాలకు పాల్పడిన వైనాలు కూడా వెల్లడవుతున్నాయి. తాజాగా గతంలో కడప వైద్య ఆరోగ్య శాఖలో రీజినల్ డైరెక్టరుగా పనిచేసిన డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్ పోస్టులు ఖాళీ లేకున్నా.. కొంత మందికి అక్రమంగా ఉద్యోగాలు ఇచ్చిన వైనాన్ని ప్రభుత్వం పసిగట్టింది. ఈ అడ్డదిడ్డమైన వ్యవహారం కారణంగా ప్రమోషన్లు పొందిన 9 మంది ఉద్యోగులు ఇప్పటికీ జీతాలు రాక సమస్యల్లో చిక్కుకోవడం కొస మెరుపు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించడానికి ప్రాథమికంగా సోమవారం సదరు ఆర్డీ అనిల్‌కుమార్‌కు సంజాయిషీలు కోరుతూ నోటీసులు జారీ చేసింది.

కడప వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టరు పరిధిలోని నంద్యాల జిల్లాలో 2023లో ఈ వ్యవహారం చోటు చేసుకుంది. నంద్యాల జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న 9 మంది ఉద్యోగులకు ఆర్డీ అనిల్‌కుమార్ ఎంపీహెచ్ఎస్, స్టాఫ్ నర్సులుగా అక్రమంగా పదోన్నతులు కట్టబెట్టారు. అంతటితో ఆగకుండా వారికి జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల్లో పోస్టింగులిచ్చారు. ఈమేరకు పదోన్నతులు పొందిన వారు కూడా కొత్త స్థానాల్లో చేరిపోయారు. అయితే తీరా జీతాలు చెలించాల్సి వచ్చే సరికి ఆయా స్థానాల్లో అసలు ఖాళీలు లేవని గుర్తించారు. ఫలితంగా జీతాలు లేకుండానే వీరంతా ఏళ్ల తరబడి పనిచేయాల్సి వచ్చింది.

ప్రస్తుతం మంగళగిరిలోని వైద్యశాఖ కమ్యూనిటీ హెల్త్, కుటుంబ సంక్షేమ శాఖ ఎంహెచ్ఎన్ విభాగంలో అడిషనల్ డైరెక్టరుగా పనిచేస్తున్న అనిల్‌కుమార్ నిర్వాకం వెలుగులోకి వచ్చింది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సి వున్నందున 15 రోజుల్లోగా అభియోగాలపై సంజాయిషీ సమర్పించుకోవాలని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మణి సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

పదోన్నతులు పొందిన వారు

ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా.. పద్ధతులు పాటించకుండా పదోన్నతులతోపాటు నంద్యాల జిల్లాలో పోస్టింగులు పొంది 2023 నుంచి జీతాలు రాకుండా వున్న ఉద్యోగులు.. ఎంపీహెచ్ఎస్‌లు కె.పద్మావతి (పీహెచ్‌సీ మాయలూరు), ఎన్.ధనమ్మ (పెద్దఎమ్మిగనూరు) భాగ్యమ్మ (డబ్ల్యు కొత్తపల్లె), ఎ.శిరీష (నొస్సం), వి.వరలక్ష్మి (అహోబిలం), మరో వి.వరలక్ష్మి (కోడుమూరు), డి.మధుకుమార్ (పాములపాడు), ఎస్.వన్నూరు బాషా (తలముడిపి), స్టాఫ్ నర్సు ఎం.అరుణకుమారి (దీబగుంట్ల పీహెచ్‌సీ).

అక్రమ గ్యాస్‌సిలిండర్లు పట్టివేత


సీజ్ చేసిన సిలిండర్లు

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలోని చిలకలబావి వద్ద ఓ వ్యక్తి అక్రమంగా సిలిండర్లు నిల్వ ఉంచి.. విక్రయిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు కడప రీజనల్ విజిలెన్స్ అధికారులు గీతావాణి, దక్షిణ రామమూర్తి, ఫుడ్‌ఇన్స్‌పెక్టర్, కడప మున్సిపల్ కార్పొరేషన్ మనోజ్‌లు తెలిపారు. కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫీసరు జి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమవారం నగరంలోని చిలకలబావి జీఎం ఫంక్షన్‌హాలు వద్ద మిట్ట సుబ్బనరసయ్య అనే వ్యక్తి గృహఅవసరాల నిమిత్తం వాడుకునే గ్యాస్‌సిలిండర్లను అక్రమంగా విక్రయిస్తుండగా తనిఖీ చేశామన్నారు. తనిఖీల్లో మోసం బయటపడడంతో అక్కడ ఉండే 21 గ్యాస్‌సిలిండర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితునిపై 6(ఎ) కేసు నమోదు చేశామన్నారు.

అగ్నికి ఆహుతైన మామిడి చెట్లు


శ్రీనివాసపురంలో కాలిపోయిన మామిడి చెట్లను చూపిస్తున్న బాధితుడు శ్రీనివాసులు

గాలివీడు, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు పెట్టిన అగ్నికి మామిడి చెట్లు ఆహుతి అయ్యాయి. బాధితుని కథనం మేరకు వివరాల్లోకి వెళితే... నూలివీడు పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన పోలా శ్రీనివాసులు గ్రామానికి సమీపంలో మామిడి తోట ఉంది. సోమవారం మధ్యాహ్నం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సమీపంలోని గుట్టకు నిప్పు పెట్టడంతో అక్కడి నుంచి వ్యాపించి మామిడి తోటకు అంటుకొని దాదాపుగా 40 వరకు చెట్లు కాలిపోయాయి. చెట్లకు 10 సంవత్సరాలకు పైబడి వయస్సు ఉందని.. మామిడి చెట్లను బతికించుకోవడానికి రూ.వేలు ఖర్చు పెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశానని తెలిపారు. పూతకు వచ్చిన దశలో నిప్పు పెట్టడంతో మొత్తం చెట్లు అన్ని కాలిపోయాయని వాపోయారు. అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి సహాయం అందజేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

వాల్మీకిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠలం గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమా దంలో కురబలకోట మండలం అడవి పల్లెకు చెందిన శారద మృతి చెందిన విషయం విదితమే. అదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె భర్త మాధవరెడ్డి బెంగళూరులో చికిత్స పొందు తూ సోమవారం ఉదయం మృతి చెందాడు. వాల్మీకిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పీలేరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుపులవేముల పంచాయతీ రెడ్డివారిపల్లె వద్దనున్న బస్టాప్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ గత రెండు రోజులుగా అదే బస్టాపులో ఉన్న అతను సోమవారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు సమాచారం అందించడంతో అతని మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించామని తెలిపారు. అతని గురించి తెలిసిన వారు తమకు 9440796744, 9440796745 నెంబర్లకు సమాచారం అందిం చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రేమ పెళ్లి పేరుతో మోసం... యువకుడి అరెస్టు

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం వన్‌టౌన్ పరిధికి చెందిన ఓ యువతిని ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేసిన యువకున్ని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. నంద్యాల జిల్లా దొర్లపాడు గ్రామానికి చెందిన గణేశ్ కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తుండేవాడు. అక్కడే పనిచేస్తున్న ఓ యువతిని ప్రేమ పెళ్లి పేరుతో శారీరకంగా వాడుకుని మోసం చేశాడు. ఈ మేరకు యువతి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి.. గణేశ్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

అదృశ్యమయ్యాడు.. ఆపై శవమై తేలాడు

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం రిమ్స్‌లో చికిత్స కోసం వచ్చి అక్కడ నుంచి అదృశ్యమై చివరికి శవమై తేలాడు. రిమ్స్ పోలీసుల వివరాల మేరకు.. ఆర్‌టీపీపీలో బాలాంజనేయులు (54) అనే వ్యక్తి ఉద్యోగిగా పనిచేసున్నాడు. ఈయన గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జనవరి 6న కడప రిమ్స్‌లో చేర్పించారు. మరుసటిరోజు 6వ తేదీ రాత్రి ఆసుపత్రి నుంచి బయటికి వెళ్లి అదృశ్యమయ్యాడు. జ్యోతి కెమికల్ సమీపంలోని పాడుబడ్డ లెట్రిన్ గుంత నుంచి దుర్వాసన రావబంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి వెళ్లి పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహానికి ఉన్న దుస్తుల ఆధారంగా బాలాంజనేయులు కుటుంబ సభ్యులను పిలిపించి వారు బాలాంజనేయులుగా గుర్తించారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. అయితే 6వ తేదీ మిస్సింగ్ అయిన బాలాంజనేయులు ఎక్కడెక్కడ తిరిగాడో, ఏమి అనేది పూర్తి వివరాలు తెలియడం లేదు. కుటుంబ సభ్యులు కూడా ఫిబ్రవరి 19న ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారించారు. సోమవారం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

విషద్రావణం తాగి వివాహిత ఆత్మహత్య

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఐటీఐ సర్కిల్ సమీపంలో ఉన్న ఓ వివాహిత తలకు పూసుకునే రంగు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. తాలుకా సీఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. ఐటీఐ సర్కిల్‌కు చెందిన సుభాన్‌బీ (22)కి నాలుగేళ్ల క్రితం చెన్నూరు మండలం ఓబులవారిపల్లెకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా కడప ఐటీఐ సమీపంలో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో మనస్థాపం చెందిన ఆమె ఆదివారం రాత్రి తలకు పూసుకునే రంగు తాగడంతో కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :కడప నగరం ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న చెంద్రాయుడు (27) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిన్నచౌకు పోలీసుల వివరాల మేరకు.. కడప ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న చెంద్రాయుడు చిన్నచిన్న పనులు చేసుకుంటూ తల్లి వద్దనే ఉంటున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. బంధువుల వివరాల మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



పెండ్లిమర్రి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగనపల్లె గ్రామ దళితవాడలో మేరి (52) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మృతురాలి కూతురు నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ చల్లని దొర, ఎస్సైలు సిబ్బందితో కలసి పరిశీలించారు.

కందులను దించుకోని వేర్‌హౌస్ అధికారులు

● నాలుగురోజులుగా ఇబ్బందులు పడుతున్నడ్రైవర్లు
● సరుకు సరిగా లేకపోవడంతో దించుకోలేదంటున్న అధికారులు


అనంతపురం జిల్లా నుంచి లారీల్లో తెచ్చిన విత్తన కందులను అన్‌లోడుచేయక నిలబడిన లారీలు

ప్రొద్దుటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో గల వేర్‌హౌస్‌గోడౌన్‌కు అనంతపురం జిల్లా రొద్దం నుంచి లారీల్లో వచ్చిన కందులను అధికారులు నాలుగు రోజులుగా దించుకోలేదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గోడౌన్ అధికారులతో లారీ డ్రైవర్లు వాగ్వాదానికి దిగారు. గత నాలుగు రోజులుగా లారీలు నిలబడి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే లేరన్నారు. దీనిపై వేర్ హౌస్ టెక్నికల్ సిబ్బంది 25 లారీల్లో కందుల విత్తనాలు వచ్చాయని.. 16 లారీల్లోని కందులు దించామన్నారు. తక్కిన లారీల్లో కందులు నాసిరకంగా ఉండటంతో అన్‌లోడ్ చేయలేమని తెలిపామన్నారు. రైతులకు అందజేయాల్సిన విత్తనాలు నాసిరకంగా ఉండటంతో దాదాపు 10 లారీల్లోని కందులను తిరిగి వెనక్కి పంపామని తెలిపారు.

రూ.10 లక్షలు చోరీ

సుండుపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాగంపల్లి గ్రామ పంచాయతీ కుంటలముందర సమీపంలోని గురప్పచెరువు వద్ద ఓ వ్యక్తి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు రూ.10 లక్షలు చోరీ చేశారు. పోలీసుల వివరాల మేరకు... సోమవారం రాత్రి భూమి కొనుగోలుకు నగదును బ్యాగులో తిసుకుపోతుండగా ముగ్గురు వ్యక్తులు అడ్డుకొని అపహరించినట్లు బాధితుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని ఎస్ఐ శ్రీనివాసులు విచారణ చేస్తున్నట్లు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. ఇంకా కేసు నమోదు చేయలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

ఉద్యోగాల పేరుతో మోసం

● ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలి ● ప్రజావాణిలో జేసీకి బాధితుల ఫిర్యాదు


జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతి పత్రం అందజేసిన బాధితులు

జమ్మలమడుగు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ఏజెంట్‌పై చర్యలు తీసుకుని.. తమకు న్యాయం చేయాలని జమ్మలమడుగు ప్రాంతానికి చెందిన బాధితులు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు సోమవారం ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. కడపకు చెందిన ఆది రవి కుమార్ అనే వ్యక్తి కేంద్ర ప్రభుత్వ సంస్థ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఒక్కొక్కరి వద్ద రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు సుమారు కోటి రూపాయలు వసూలు చేశారన్నారు. ఫేక్‌మెయిల్‌తో అపాయింట్‌మెంట్ లెటర్లు పంపి అధికారులను సైతం మోసం చేశారన్నారు. దీనిపై జమ్మలమడుగు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత తమను బెదిరిస్తున్నారని వాపోయారు. విచారణ చేసి తమకు న్యాయం చేయాలని జేసీకి విన్నవించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, కమిటీ నాయకుల పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో పసికందు మృతి

● వైద్యుని నిర్లక్ష్యం కారణమంటూ కుటుంబసభ్యుల ఆందోళన
● ఇన్‌ఫెక్షన్ల వల్ల మరణించాడని డాక్టర్ వివరణ


ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న పసికందు తల్లి బంధువులు

ప్రొద్దుటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని గాంధీరోడ్డు పోసినా కాంపౌండులో వున్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పది రోజుల పసికందు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు సరైన వైద్యం అందించక పోవడంతో మృతి చెందాడని బంధువులతో కలిసి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే...

జమ్మలమడుగు నియోజకవర్గం గండికోటకు చెందిన నాగేశ్వరి అనే మహిళ ఫిబ్రవరి 20న జమ్మలమడుగులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మగబిడ్డను ప్రసవించింది. ఆబిడ్డ ఏడుపు లేకుండా పుట్టడంతో పిల్లల వైద్య నిపు ణులకు చూపించమని అక్కడి వైద్యులు చెప్పడంతో ఫిబ్రవరి 21 న రాత్రి ప్రొద్దుటూరు గాంధీ రోడ్డులో గల చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించారు. పిల్లల వైద్య నిపుణుడు మొదట రూ.25 వేల ప్యాకేజీ అడ్వాన్స్ కట్టించుకుని చికిత్స ప్రారం భించినట్టు తల్లిదండ్రులు తెలిపారు. 11 రోజుల పాటు బాలుడికి చికిత్స చేసి రూ.4లక్షలు వసూళ్లు చేసి ఆఖరికి బాలుడి మృతదే హాన్ని అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యలో వేరే చోటి కి వెళతామన్నా డాక్టర్ ఒప్పుకోలేదని తీరా విషమించాక కర్నూ లుకు తీసుకెళ్లమని చెప్పాడని బాలుడి తండ్రి గురుమోహన్ తెలి పారు. ఈ ఆందోళనక్రమంలో అదే ఆసుపత్రిలో తమ పిల్లలకు సరైన వైద్యం అందించకుండా లక్షలు వసూలు చేసి అనారోగ్యం బాగుచేయడం లేదన్నారు. దీంతో మా పిల్లలప్రాణాలు కాపాడు కోవడానికి వేరే ఆసుపత్రికి వెళ్ళి రక్షించుకున్నామని తెలిపారు. ఈ పసికందు మరణంపై డాక్టర్ లోకేశ్వర్‌ను వివరణ కోరగా 21 న రాత్రి బాలుడుని ఆసుపత్రికి తెచ్చారని.. పసికందుకు 10 రోజులు ఆసుపత్రిలో సక్రమంగా చికిత్స అందించామన్నారు. అయితే ఇన్‌ఫెక్షన్ వల్ల బీపీ పెరిగి గుండె వేగంగా కొట్టుకోవడం వలన ప్రాణాలు కాపాడలేకపోయామన్నారు.

'శెట్టిపల్లె' చింత తీర్చే వారేరీ?

- పంచాయతీని విభజించారు
- కోర్టు స్టేతో ఆగిన ఎన్నికలు
- అందని ఆర్థిక ఫైనాన్స్ నిధులు
- మౌలిక వసతులకు చిల్లిగవ్వలేక అవస్థలు



శెట్టిపల్లె గ్రామ సచివాలయ కార్యాలయం


గాండ్లపల్లె వద్ద మరమ్మతులకు నోచుకోని తాగునీటి బోరు

సంబేపల్లె, మార్చి3 (ఆంధ్రజ్యోతి): అది శెట్టిపల్లె పంచాయతీ. పదివేల మంది జనాభా. రాయచోటి నియోజకవర్గం సంబేపల్లె మండలంలో అతి పెద్ద పంచాయతీ. 66 ఆవాసాలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో 2021 జూన్‌లో జరిగిన ఎన్నికల్లో పెద్దబిడికి, శెట్టిపల్లి, సదిపిరివాండ్లపల్లె, అడవికమ్మపల్లెలను గ్రామ పంచాయతీలుగా విభజించారు. ఇందులో 1200 ఎస్టీ జనాభా గల 759 ఓట్లు ఉన్న పెద్దబిడికి ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. మిగిలిన మూడు పంచాయతీల్లో విభజన ప్రక్రియ సక్రమంగా లేదని కొందరు కోర్టును ఆశ్రయించడంతో యథాస్థితిలో ఉంచేలా కోర్టు ఎన్నికల ముందు స్టే ఇచ్చింది. దీంతో ఎన్నికలు నిలిచి పోయాయి. పంచాయతీ సెక్రటరీలను మాత్రం ముగ్గురిని కేటాయించారు. ఇది ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఎన్నికలు జరగకపోవడంతో గ్రామ పంచాయతీలకు వచ్చే వార్షిక సంవత్సరం ఆర్థిక ఫైనాన్స్ 14, 15 ఫైనాన్స్ నిధులను పంచాయతీలకు ఇవ్వలేదు. దీంతో గ్రామాల్లో కనీసం మౌలిక వసతులు కల్పించేందుకు చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్యం చర్యలు కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

చాలా కాలంగా ప్రత్యేక అధికారుల పాలనలోనే..

శెట్టిపల్లి గ్రామ పంచాయతీ చాలా కాలంగా అతి పెద్ద గ్రామ పంచాయతీగా కొనసాగించారు. 1964 నుంచి 87 వరకు మల్లు నరసింహారెడ్డి సర్పంచ్‌గా పనిచేశారు. ఆ తరువాత 1987 నుంచి 92 వరకు మాలే వెంకటయ్య సర్పంచ్‌గా పనిచేశారు. ఆ సమయంలో పంచాయతీ జనాభాను బట్టి విభజన చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో 2012 వరకు ఎన్నికలు జరగలేదు. ప్రత్యేక అధికారి పాలనలో కొనసాగించారు. 2012 నుంచి 2017 వరకు తిరిగి ఒకే గ్రామ పంచాయతీగా చేస్తూ అప్పట్లో మూడే రేవతి సర్పంచ్‌గా పనిచేశారు. అనంతరం గత వైసీపీ ప్రభుత్వంలో నాలుగు పంచాయతీలుగా విభజించారు. ఎస్టీ జనాభా కలిగిన పెద్ద గ్రామాల్లో ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి పెద్దబిడికి 2021 జూన్‌లో ఎన్నికలు జరిపారు. మిగిలిన మూడు గ్రామ పంచాయతీలు భౌగోళిక విభజన సరిగా లేదంటూ కోర్టుకెళ్లడంతో యథాస్థితిలో కొనసాగించేలా స్టే ఇస్తూ ఎన్నికలు నిలిపేశారు.

పంచాయతీ విభజనలో ఆవాసాలు తారుమారు

శెట్టిపల్లె పంచాయతీ అనుకుని అరకిలోమీటర్ దూరంలో దొడ్డిచేను వడ్డెపల్లె ఉంది. ఈ ఆవాసాన్ని మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సదిపిరివాండ్లపల్లె పంచాయతీకి మార్చారు. కొన్ని ఆవాసాలను ఇలా తారుమారు చేయడంతో ఒక పంచాయతీకి అనుకూలంగా మార్చడం సరికాదని కోర్టుకు వెళ్లారు. విభజన సక్రమంగా చేసి ఎన్నికలు జరపాల్సిన అవసరం ఉంది.

నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి



అడవికమ్మపల్లి, సదిపిరివాండ్లపల్లె పంచాయతీల్లో కనీసం మౌలిక వసతుల కోసం 15వ ఫైనాన్స్ నిధులను మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి తెలిపారు. ఎన్నికలు జరగకపోవడంతో పంచాయతీలకు నిధులు రాక కనీసం బో రు మరమ్మతుల కోసం పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయని తెలియజేసినట్లు తెలిపారు. నిధులు కేటాయించి ప్రజల అవసరాలను తీర్చాల్సిన బాధ్యత మాపై ఉంది. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయించేలా చూస్తాం. - మల్లు నరసారెడ్డి మాజీ జెడ్పీటీసీ సంబేపల్లె శెట్టిపల్లె

బోర్లు రిపేరు వచ్చినా మరమ్మతులు చేసే వారు లేరు



శెట్టిపల్లి పంచాయతీలో ఎన్నికలు జరగలేదు. సర్పంచ్ లేడు. గ్రామాల్లో బోర్లు రిపేరు వచ్చినా మరమ్మతులు చేసేవారు లేరు. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంద పంచాయతీ సెక్రటరీలు ఉన్నా నిధులు లేక నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం నిధులు క ల్పించి ప్రజల సమస్యలు తీర్చాల్సిన బాధ్యత ఉంది. - రవీంద్రారెడ్డి, శెట్టిపల్లె, పెదచెరువు నీటి సంఘం అధ్యక్షుడు

సబ్‌కలెక్టర్‌కు వినతి

రాజంపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : తాను ఓబులవరిపల్లె మండలం గొబ్బూరువారిపల్లె సబ్‌స్టేషన్‌లో స్విచ్ ఆపరేటర్‌గా పనిచేస్తుండగా అన్యాయంగా తొలగిచారని పేర్కొంటూ రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవికి సోమవారం ఫిర్యాదు చేసి నట్లు పసుపులేటి గంగాధరసాయి తెలిపారు. తాను గొబ్బూరువారిపల్లె సబ్‌స్టేషన్‌లో స్విచ్ ఆపరేటర్‌గా 14 నెలల నుంచి పనిచేస్తున్నానన్నారు. అయినా తనకు అప్పటి నుంచి ఇప్పటివరకు జీతాలు కూడా ఇవ్వలేదన్నారు. అయితే ఫిబ్రవరి 18వ తేదీ నుంచి తనను డ్యూటీలోకి రావద్దని ఏఈ, ఏడీఈ తెలిపి అప్పటి నుంచి తనను ఉద్యోగానికి రానివ్వడం లేదన్నారు. తనను ఉద్యోగంలో చేరేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు

గాలివీడు, మార్చి3(ఆంధ్రజ్యోతి): అధికారులు విధులకు విఘాతం కలిగించేలా తప్పుడు అర్జీలను సమర్పించి బెదిరింపులకు పాల్పడేవారిపై చర్యలు తీ సుకుంటామని తహసీల్దార్ భాగ్యలత హెచ్చరించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఆర్‌ఐ బాలాజీ, వీఆర్‌వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కిలారి చిన్నప్పనాయుడు మృతి


చిన్నప్పనాయుడి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పాలకొండ్రాయుడు

సంబేపల్లె, మార్చి3(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి గ్రామం అడవికమ్మపల్లి కిలారి చిన్నప్పనాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. ఆ ఊరి ప్రజలకు ఆయన పార్టీకి, ప్రజలకు విశిష్ట సేవలు అందించారు. రాయచోటి మాజీ ఎ మ్మెల్యే, రాజంపేట మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడికి అత్యంత సన్నిహితుడు చిన్నప్పనాయుడు. అం దరూ ఆయనను పెద్దాయన అంటూ పిలుస్తారు. అంత్యక్రియలకు పాలకొండ్రాయుడు హాజరయ్యారు. ఆయనతో పాటు టీడీపీ సీనియర్ నాయకుడు, టీటీడీ మాజీ బోర్డు మెంబర్ సుగవాసి ప్రసాద్‌బాబు హాజరై మృతదేహానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితో పాటు సంబేపల్లె మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, గోపాల్, పీఎస్‌కాలనీ మాజీ సర్పంచ్ శశిధర్‌రెడ్డి నివాళులు అర్పించారు.

బాలికలను రక్షిద్దాం.. బాగా చదివిద్దాం



రాయచోటిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం.. పెనగలూరులో...

రాయచోటిటౌన్, మార్చి3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలికలను రక్షిద్దాం బాలికలను చదివిద్దాం అనే కార్యక్రమంపై ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో జిల్లా చైల్డ్ డెవలప్‌మెంట్ అథారిటీ సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేటీ పడావో, బేటీ బచావో కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వ సంస్థల ఎస్‌వోడీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది, పోలీసు సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డను రక్షిద్దాం - చదివించుకుందాం

పెనగలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆడబిడ్డను రక్షించుకుందాం, చదివించుకుందామని సీనియర్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. సోమవారం పెనగలూరు అరుంధతివాడ అంగన్వాడీ కార్యకర్తల వి.భాగ్యమ్మ అధ్యక్షతన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సూపర్‌వైజర్ ఎ.విజయకుమారి, ఏఎన్‌ఎం సు ప్రజ, కార్యకర్తలు అరుణ, శ్రీదేవి, పద్మావతి, ఉమామహేశ్వరి, సహాయకురాళ్లు కన్నమ్మ, నారాయణమ్మ పాల్గొన్నారు.

ముమ్మరంగా విద్యుత్ మరమ్మతులు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విద్యుత్ మరమ్మతుల పనులను ముమ్మరంగా చేస్తున్నట్లు ఏడీ భాస్కర్ తెలిపారు. సోమవారం వంటేల సిద్దయ్య కాంప్లెక్స్ రోడ్డు, ఎస్వీ జూనియర్ కాలేజ్ రోడ్డు, గాంధీనగర్ పలు వీధుల్లో విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పనులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కారంపల్లెలో పశువైద్య శిబిరం

రాజంపేట టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం పెద్దకారంపల్లె, మందరనం గ్రామాల్లో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. డివిజనల్ పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు విజయభాస్కర్ ఆధ్వర్యంలో డాక్టర్ కె.ప్రతాప్ సుమారు 200 పశువులకు గాలికుంటువ్యాధి, బ్రూసెల్లోసిస్ టీకా మందులు వేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిని కె.భాగ్యవతి, వరదయ్య, శివరాజు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి బోనాలు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మడలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లికి సోమవారం భక్తులు బోనాలు సమర్పించారు. గంగమ్మజాతర ముగసిన మరసటి రోజు బోనాలు సమర్పిస్తారు.అమ్మవారికి ముడుపులు, బోనాలు సమర్పించారు. ఇక్కడి ప్రజలు ప్రతి ఇంటినుంచి బోనం సమర్పిస్తారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసులు అన్ని ఏర్పాటు చేశారు. అర్చకులు చెల్లు గంగరాజు, దినేష్ బక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

రేకుల షెడ్లు తొలగించకపోతే చర్యలు

గాలివీడు, మార్చి3(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్లను వెంటనే తొలగించకపోతే చర్యలు తప్పవని ఆక్రమణదారులను ఏఈ ధర్మారెడ్డి హెచ్చరించారు. డీఈ వెంకటసుబ్బయ్య ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని గుర్రాలమిట్టలో ఆక్రమణలో ఉన్న రేకుల షెడ్లను వీఆర్‌వో అల్లాబకష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. మూడు రోజుల లోపు రేకుల షెడ్లు తొలగించకపోతే తామే స్వయంగా తొలగిస్తామని వారు హెచ్చరించారు.


తాగునీటి పైపులైనుకు మరమ్మతులు

నందలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నారాయణరాజుపేటకు తాగునీరు అందించే పైపులైను మరమ్మతులకు గురికావడంతో ఫిట్టర్ సుబ్బయ్య ఆధ్వర్యంలో సోమవారం మరమ్మతులు చేపట్టారు. పంచాయతీ సెక్రటరీ సురేష్ కుమార్ సర్పంచ్ జంబు సూర్యనారాయణ దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారమైంది.

భుజంగేశ్వరుడికి పూజలు

రైల్వేకోడూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసి ఉన్న భుజంగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అభిషేకాలు చేశారు. భుజంగేశ్వరుడు, భువనేశ్వరి దేవీలను ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పవన్, యోగీలు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా శివపార్వతుల గ్రామోత్సవం



నందలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామం ఎర్రచెరువు కట్టపై వెలసిన శ్రీ కామాక్షి సమేత చంద్రమౌలేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం శివపార్వతుల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. డీఎంసీ రోడ్ మధురాచారి వీధి, రెడ్డివీధుల గుండా కొనసాగింది. గ్రామోత్సవం వెంట ఏర్పాటు చేసిన కోలాటం, డిజే డ్రమ్స్ భక్తులను, ప్రజలను ఆకట్టుకుంది.

నాణ్యత గల బియ్యం అందజేత

రైల్వేకోడూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): రెడ్డివారిపల్లె గ్రామంలో మగ్గిపోయిన బియ్యం ప్రజలకు ఇచ్చారని ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందన లభించింది. అధికారులు రెడ్డివారిపల్లె వెళ్లి నాణ్యత గల బియ్యాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ శ్రీనివాసులు మాట్లాడుతూ మగ్గిపోయిన బియ్యం పొరపాటున వచ్చాయన్నారు.

కడుపునొప్పితో వ్యక్తి మృతి


నారాయణ మృతేహం

చిన్నవండెం, మార్చి3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురానికి చెందిన పోలిశెట్టి నారాయణ (60) ఉపాధి పనికి వెళ్లే వచ్చి మృతి చెందాడని గ్రామస్థులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... భార్య లక్ష్మీదేవి కలిసి ఉపాధి పనికి వెళ్లి జీవనం సాగించేవారన్నారు. రోజు మాదిరిగానే సోమవారం ఉదయం భార్యాభర్తలిద్దరూ ఉపాధి హామీ పనికి వెళ్లి ఇంటికి వస్తూనే కడుపు నొప్పి వచ్చింది. డాక్టర్ వద్దకు వెళితే మృతి చెందాడని పేర్కొ న్నారన్నారు.


చిత్రం చెప్పిన సమస్య

లక్కిరెడ్డిపల్లె మండలం కస్తూరిరాజుగారిపల్లె పంచాయతీలో రోడ్డు చాలా అధ్వానంగా ఉంది. ఈ మార్గంలో కొత్తగా తారు రోడ్డు వేశారు. కొంత భాగాన్ని మరిచారు. ఈ కొంచెం రోడ్డుపై ప్రమాదం తప్పదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గురయ్యగారిపల్లె నుంచి మెయిన్ రోడ్డుకు వెల్లే దారి ఇది. ఆర్‌అండ్‌బీ అధికారులూ... ఈ రోడ్డు పరిస్థితి కాస్త చూడండి సారూ... -లక్కిరెడ్డిపల్లె, (ఆంధ్రజ్యోతి)

బీజేపీ సహకారంతో అభివృద్ధిలో రాష్ట్రం పరుగులు

- అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్


సమావేశంలో మాట్లాడుతున్న సాయిలోకేష్

రాజంపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వల్ల రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు తీస్తోందని బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ పేర్కొన్నారు. సోమవారం ఒంటిమిట్ట హరిత హోటల్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు భానుప్రకాష్‌రాజు అధ్యక్షతన జరిగిన బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి సాయిలోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశంగా భారతను తీసుకెళుతున్న బీజేపీని వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అందువల్ల గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టపరచాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఇంటింటికి కేంద్ర ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లడం, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించి బీజేపీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకురావాలన్నారు.

ఉపాధి హామీ పనుల మట్టి తరలింపు


ట్రాక్టర్‌కు మట్టి లోడ్ చేస్తున్న దృశ్యం

సిద్దవటం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో భాగంగా వచ్చిన మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మండలంలోని టక్కోలి ఎర్రచెరువులో ఫిష్‌పాండ్ పనుల నిమిత్తం రెండు వారాలుగా దాదాపు 60 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఆ మట్టిని కొంతమంది ఇటుకల బట్టీలకు ట్రాక్టరు దాదాపు రూ.5 వేలతో విక్రయిస్తున్నారు. ఏపీవో నరసింహులును వివరణ కోరగా మట్టి తరలిపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆన్‌లైన్‌లో డ్వాక్రా ఉత్పత్తుల అమ్మకాలు

ఓబులవారిపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):పొదుపు సంఘాల సభ్యుల ద్వారా తయారు చేసే ఉత్పత్తులను ఆన్‌లైన్‌ద్వారా మార్కెటింగ్ చేయడానికి ఓఎన్‌డీసీ అనే ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేసినట్లు ఏసీ, ఏపీఎం మల్లికార్జునరాజు తెలిపారు. ఈ సందర్భంగా వీవోలతో సమావేశం ఏర్పాటు చేశారు. సంఘ సభ్యులు తయారు చేసే ఉత్పత్తుల గుర్తించి అవగాహన, మార్కెటింగ్ కల్పించడం తద్వారా ఆదాయాన్ని సమకూర్చేలా చేయడం ద్వారా ఎతో ఉపయోగమన్నారు. సీసీలు దామోదర్, గోవిందమ్మ, వెంకటసుబ్బమ్మ, హరిబాబు పాల్గొన్నారు.

'అక్రమ ఆస్తులను స్వాధీనపరుచుకోవాలి'

రాజంపేట టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అక్రమ ఆస్తులను స్వాధీనపరుచుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ పట్టణ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యపై విమర్శలు చేయడం తగదన్నారు.కూటమి ప్రభుత్వంలో తప్పు చేసిన ప్రతిఒక్కరికీ శిక్ష తప్పదని హెచ్చరించారు. టీడీపీ యువ నేత రాముయాదవ్, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఎస్సీసెల్ నేత వెంకటేష్, ధనుంజయ్యనాయుడు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ ఎక్కిన వైసీపీ యువనాయకులు


టీడీపీలో చేరిన వైసీపీ యువ నాయకులు

నందలూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నందలూరు గ్రామ పంచాయతి అరుంధతివాడ గ్రామంలో ఉన్నటువంటి వైసీపీ యువ నాయకులు, కోనాపురం ఉపసర్పంచ్ పుల్లయ్య ఆధ్వర్యంలో వైకాపా పార్టీని వీడి తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి సమక్షంలో సోమవారం రాత్రి తెదేపా పార్టీలో చేరారు. కండువా కప్పి పార్టీలోకి వారిని మేడా విజయశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. వెంకటేశ్, నరసింహా, హరిక్రిష్ణ, రాజా, శంకర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


వినతులు పరిశీలిస్తున్న తహసీల్దార్

రైల్వేకోడూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని తహసీల్దార్ మహబూబ్ చాంద్ తెలి పారు. సోమవారం రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఐ లక్ష్మీదేవి, సర్వేయర్ బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వన్యప్రాణులకు హాని కలిగించవద్దు

సిద్దవటం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణులకు హాని కలిగించవద్దని ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి సూచించారు. సోమవారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా సిద్దవటం ఫారెస్ట్ బీట్ కపర్దీశ్వరకోన అటవీ ప్రాంతంలో నలందా హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళావతి మాట్లాడుతూ వన్యప్రాణులకు ఈ భూమిమీద స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని, వన్యప్రాణుల సంరక్షణకు ప్రతిఒక్కరూ తోడ్పడాలన్నారు. స్కూల్ కరస్పాండెంట్ వెంకటసుబయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

రాయచోటి(కలెక్టరేట్), మార్చి3(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నేలపాటి శ్రీనివాసులు, వర్రి సురేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఆందోళనలో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు.

పీజీ కామన్ సెట్ విధానాన్ని రద్దు చేయాలి

రాయచోటి(కలెక్టరేట్), మార్చి3(ఆంధ్రజ్యోతి): పీజీ కామన్ సెట్ విధానాన్ని, జీవో నెంబర్-77 రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు డిమాండ్ చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంత విద్యార్థులు సీట్ పొందినా ఆర్థిక, సామాజిక పరిస్థితుల వల్ల చదువుకు దూరమవుతున్నారన్నారు. పీజీ కామన్ సెట్ విధానాన్ని రద్దు చేయాలని, అలాగే జీవో నెంబర్-77ను రద్దు చేయాలని జీవో తీసుకురావడం వలన 10 లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికే ప్రాధాన్యం

రామాపురం, మార్చి3(ఆంధ్రజ్యోతి): తాగునీటి సమస్య పరిష్కారానికే రాష్ట్ర రవాణ, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నట్లు లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిలేవుల రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. వాల్మీకిపురంలో సోమవారం తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్ వేయించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు నల్లగుట్టపల్లి మాజీ ఎంపీటీసీ రవికుమార్ రెడ్డి, టీడీపీ యువనాయకుడు చెన్నూరు బాబు, దామోధర్ నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు తప్పిన పెను ప్రమాదం

గాలివీడు, మార్చి3(ఆంధ్రజ్యోతి): చెట్టుకొమ్మ విరిగి పడిన ఘటనలో స్కూల్ విద్యార్థులకు తృటి లో పెను ప్రమాదం తప్పింది. పాటశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత కథనం మేరకు... వెలిగల్లులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉదయం 8.40 గంటల ప్రాంతంలో విద్యార్థులు ప్రార్థన చేయడానికి పాఠశాల మైదానంలో ఉన్న చెట్ల కింద నిల్చున్నారు. అయితే సుంకేల చెట్టుకు కొమ్మ విరిగి పడటంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు.

ఉప్పరపల్లెలో అక్రమాల జోరు


ఆక్రమించేందుకు కొండప్రాంతాన్ని చదును చేసిన దృశ్యం

సిద్దవటం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లెలో అక్రమాలు జోరందకుంటున్నాయి. సర్వేనంబరు 421/10, 424లో సుమారు 50 సెంట్ల పైబడి చదును చేసి అన్యాక్రాంతానికి సిద్ధమయ్యారు.అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. మండల ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలతను వివరణ కోరగా పనులు నిలుపుదల చేశామన్నారు.

మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేద్దాం

రాజంపేట టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజల తరఫున ఎన్నికైన కౌన్సిలర్లకు ప్రాధాన్యతను ఇచ్చి రాజంపేట పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేద్దామని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి సూచించారు. సోమవారం రాజంపేట మున్సిపల్ సమావేశం చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి మేడా రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాజంపేటను సమష్టిగా అభివృద్ధి చేద్దామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు కూండ్ల వెంకటరమణారెడ్డి, సూరి, టీడీపీ ఫ్లోర్‌లీడరు తుపాకుల అశోక్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ తాము ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైనప్పటికీ అధికారులు ప్రాధాన్యత ఇవ్వడంలేదన్నారు.

మార్కెట్ అభివృద్ధికి రూ.25 లక్షల నిధులు


మాట్లాడుతున్న మేడా రఘునాథ్‌రెడ్డి

రాజంపేట మార్కెట్ అభివృద్ధికి రూ.25 లక్షల ఎంపీ నిధులను కేటాయిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ నిధులతో మార్కెట్‌లో అభివృద్ధి పనులు చేయాలన్నారు.

ఎన్‌ఏటీఎస్‌కు విశేష స్పందన

● పట్టణ ఎస్‌హెచ్‌జీ పట్టభద్రులకు శిక్షణ ● అప్రెంటిషిప్‌లకు దరఖాస్తుల వెల్లువ ● లక్ష్యం 2150... దరఖాస్తులు 2986


దరఖాస్తులు స్వీకరిస్తున్న మెప్మా సిబ్బంది (ఫైల్)

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న జాతీయ అప్రెంటిషిప్ శిక్షణ పథకం(ఎన్‌ఏటీఎస్)కు విశేష స్పందన లభిస్తోంది. ఈ పథకం ద్వారా నగర, పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల్లో 2021 తర్వాత పట్టభద్రులైన సభ్యులు, వారి పిల్లలకు వృత్తి నైపుణ్య, జీవన నైపుణ్య శిక్షణ అందించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), ఆశా సొసైటీ సహకారంతో 2024-25 సంవత్సరానికి అప్రెంటిషిప్ ద్వారా లబ్ధి చేకూర్చేందుకు ఒప్పందం చేసుకుంది.

జిల్లాలోని కడప నగరంతో పాటు జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేలు, మైదుకూరు, ఎర్రగుంట్ల, కమలాపురం పట్టణాల్లో 2,150 మంది డిగ్రీ చదివిన స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు, వారిపిల్లలకు అవసరమైన వృత్తి జీవన నైపుణ్య శిక్షణ అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ప్రస్తుతం ఎటువంటి ఉద్యోగం ఉపాధి లేకుండా ఇంట్లో ఖాళీగా ఉన్నవారు అర్హులుగా పరి గణించారు. దీంతో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్య అర్హత ధ్రువపత్రాలతో పాటు ఆధార్ కార్డు, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ ఫోన్ నెంబర్, బ్యాంకు ఖాతా, ఇ-మెయిల్ ఐడీలాంటి వివరాలతో దరఖాస్తులను స్వీకరించారు. ఈదరఖాస్తులు మెప్మా ఎస్ఎల్ఎఫ్ ఆర్పీ, కమ్యూనిటీ ఆర్గనైజర్ ద్వారా వెబ్‌సైట్‌లో నమోదు చేశారు.

లక్ష్యానికి మించి దరఖాస్తులు

ప్రభుత్వం కడప జిల్లాకు సంబంధించి 2150 మందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించింది. కానీ క్షేత్రస్థాయిలో 2986 మంది దరఖాస్తులను సమర్పించారు. బద్వేలు పట్టణ ప్రాంతంలో 300 మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉండగా 362 మంది, జమ్మలమడుగులో 150 మందికి 183 మంది, కడప నగరంలో 500 మందికి 940 మంది, ప్రొద్దుటూరు పట్టణంలో 300 మందికి 462, పులివెందులలో 300 మందికి 339 మంది, మైదుకూరులో 300 మందికి 368 మంది, ఎర్రగుంట్లలో 150 మందికి 160 మంది, కమలాపురంలో 150 మందికి గాను 172 మంది దరఖాస్తులు సమర్పించారు.

ప్రయోజనాలు ఇవే...

శిక్షణ అనంతరం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ, సంబంధిత పరిశ్రమ నుంచి ధ్రువపత్రాలు జారీ చేస్తారు. వీటి ఆధారంగా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. అదేవిధంగా శిక్షణ కంపెనీ లేదా ఏడాది పాటు ప్రతినెల రూ.4500 ఉపకారవేతనం అందజేయడం జరుగుతుంది.

దరఖాస్తులకు మంచి స్పందన

ఎన్‌ఏటీఎస్ అప్రెంటి షిప్‌కు సంబంధించి దరఖాస్తులు స్వీకరిం చాం. లక్ష్యానికి మించి దరఖాస్తులు అం దాయి. డిగ్రీ రెగ్యులర్ మోడ్‌లో ఉత్తీర్ణు లైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరిగింది.

-ఎం.కిరణ్‌కుమార్, పీడీ మెప్మా

ట్రిపుల్‌ఐటీ తాత్కాలిక అధ్యాపకుల నిరసన

● 110 జీఓ ప్రకారం వేతనం ఇవ్వాలని డిమాండ్


అకడమిక్ బ్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న తాత్కాలిక అధ్యాపకులతో చర్చిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇడులపులపాయ ట్రిపుల్ ఐటీలో విద్యాబోధన చేస్తున్న తాత్కాలిక అధ్యాపకులు క్యాంప స్‌లో రోడ్డెక్కారు. ఏడేళ్లుగా పనిచేస్తున్న అరకొర వేతనమే ఇస్తున్నారని.. 110 జీఓ అమలు చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం ట్రిపుల్‌ఐటీ ఓల్డ్ క్యాంపస్ సమీపంలో ఉన్న ఆర్జీయూకేటీ ఎంబ్లమ్ వద్ద ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. గెస్ట్‌ఫ్యాకల్టీ నుంచి కాంట్రాక్టు అధ్యాపకులుగా మార్చి 110 జీఓ ప్రకారం రూ.33వేల వేతనం, ఏడాదికి రూ.1000 ఇన్సెంటివ్ జమ చేసి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రతినిధి నజీర్ ఏడేళ్లుగా పనిచేస్తున్నా తమకు ఆర్జీ యూకేటీ తమకు తీరని అన్యాయం చేస్తోందని, చాలీచాలనీ జీతంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్త ధర్నా చేస్తున్న తాత్కాలిక అధ్యాపకులతో చర్చించారు. సమస్యను రిజిస్ట్రార్ దృష్టికి తీసుకెళ్లి పలు మార్లు డైరెక్టర్ నచ్చజెప్పినా నిరసన కొనసాగించారు. సాయంత్రం రిజిస్ట్రార్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. సాంకేతిక విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో జరగబోయే గవర్నింగ్ కౌన్సిల్ మీటింగ్‌లో సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను తాత్కాలికంగా విరమించారు.

ఇష్టానుసారం పదోన్నతులు.. ఖాళీలు లేకున్నా పోస్టింగులు

● కడప పూర్వ వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ నిర్వాకం
● ఆలస్యంగా గుర్తించి విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

కలికిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పర్యవేక్షణ గాలికొదిలేసిన కారణంగా అన్ని స్థాయిల్లోనూ అధికారులు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన ఉదంతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. వివిధ శాఖల్లో అధికారులు అన్ని రకాల నియమాలను తుంగలో తొక్కి. అక్రమాలకు పాల్పడిన వైనాలు కూడా వెల్లడవుతున్నాయి. తాజాగా గతంలో కడప వైద్య ఆరోగ్య శాఖలో రీజినల్ డైరెక్టరుగా పనిచేసిన డాక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్ పోస్టులు ఖాళీ లేకున్నా.. కొంత మందికి అక్రమంగా ఉద్యోగాలు ఇచ్చిన వైనాన్ని ప్రభుత్వం పసిగట్టింది. ఈ అడ్డదిడ్డమైన వ్యవహారం కారణంగా ప్రమోషన్లు పొందిన 9 మంది ఉద్యోగులు ఇప్పటికీ జీతాలు రాక సమస్యల్లో చిక్కుకోవడం కొస మెరుపు. ఈ మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించడానికి ప్రాథమికంగా సోమవారం సదరు ఆర్డీ అనిల్‌కుమార్‌కు సంజాయిషీలు కోరుతూ నోటీసులు జారీ చేసింది.

కడప వైద్య ఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టరు పరిధిలోని నంద్యాల జిల్లాలో 2023లో ఈ వ్యవహారం చోటు చేసుకుంది. నంద్యాల జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న 9 మంది ఉద్యోగులకు ఆర్డీ అనిల్‌కుమార్ ఎంపీహెచ్ఎస్, స్టాఫ్ నర్సులుగా అక్రమంగా పదోన్నతులు కట్టబెట్టారు. అంతటితో ఆగకుండా వారికి జిల్లాలోని వివిధ పీహెచ్‌సీల్లో పోస్టింగులిచ్చారు. ఈమేరకు పదోన్నతులు పొందిన వారు కూడా కొత్త స్థానాల్లో చేరిపోయారు. అయితే తీరా జీతాలు చెల్లించాల్సి వచ్చే సరికి ఆయా స్థానాల్లో అసలు ఖాళీలు లేవని గుర్తించారు. ఫలితంగా జీతాలు లేకుండానే వీరంతా ఏళ్ల తరబడి పనిచేయాల్సి వచ్చింది.

ప్రస్తుతం మంగళగిరిలోని వైద్యశాఖ కమ్యూనిటీ హెల్త్, కుటుంబ సంక్షేమ శాఖ ఎంహెచ్ఎన్ విభాగంలో అడిషనల్ డైరెక్టరుగా పనిచేస్తున్న అనిల్‌కుమార్ నిర్వాకం వెలుగులోకి వచ్చింది. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సి వున్నందున 15 రోజుల్లోగా అభియోగాలపై సంజాయిషీ సమర్పించుకోవాలని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్‌మణి సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

పదోన్నతులు పొందిన వారు

ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా.. పద్ధతులు పాటించకుండా పదోన్నతులతోపాటు నంద్యాల జిల్లాలో పోస్టింగులు పొంది 2023 నుంచి జీతాలు రాకుండా వున్న ఉద్యోగులు.. ఎంపీహెచ్ఎస్‌లు కె.పద్మావతి (పీహెచ్‌సీ మాయలూరు), ఎన్.ధనమ్మ (పెద్దఎమ్మిగనూరు) భాగ్యమ్మ (డబ్ల్యు కొత్తపల్లె), ఎ.శిరీష (నొస్సం), వి.వరలక్ష్మి (అహోబిలం), మరో వి.వరలక్ష్మి (కోడుమూరు), డి.మధుకుమార్ (పాములపాడు), ఎస్.వన్నూరు బాషా (తలముడిపి), స్టాఫ్ నర్సు ఎం.అరుణకుమారి (దీబగుంట్ల పీహెచ్‌సీ).

అక్రమ గ్యాస్‌సిలిండర్లు పట్టివేత


సీజ్ చేసిన సిలిండర్లు

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలోని చిలకలబావి వద్ద ఓ వ్యక్తి అక్రమంగా సిలిండర్లు నిల్వ ఉంచి.. విక్రయిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు కడప రీజనల్ విజిలెన్స్ అధికారులు గీతావాణి, దక్షిణ రామమూర్తి, ఫుడ్‌ఇన్స్‌పెక్టర్, కడప మున్సిపల్ కార్పొరేషన్ మనోజ్‌లు తెలిపారు. కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫీసరు జి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సోమవారం నగరంలోని చిలకలబావి జీఎం ఫంక్షన్‌హాలు వద్ద మిట్ట సుబ్బనరసయ్య అనే వ్యక్తి గృహఅవసరాల నిమిత్తం వాడుకునే గ్యాస్‌సిలిండర్లను అక్రమంగా విక్రయిస్తుండగా తనిఖీ చేశామన్నారు. తనిఖీల్లో మోసం బయటపడడంతో అక్కడ ఉండే 21 గ్యాస్‌సిలిండర్లను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితునిపై 6(ఎ) కేసు నమోదు చేశామన్నారు.

అగ్నికి ఆహుతైన మామిడి చెట్లు


శ్రీనివాసపురంలో కాలిపోయిన మామిడి చెట్లను చూపిస్తున్న బాధితుడు శ్రీనివాసులు

గాలివీడు, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు పెట్టిన అగ్నికి మామిడి చెట్లు ఆహుతి అయ్యాయి. బాధితుని కథనం మేరకు వివరాల్లోకి వెళితే... నూలివీడు పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన పోలా శ్రీనివాసులు గ్రామానికి సమీపంలో మామిడి తోట ఉంది. సోమవారం మధ్యాహ్నం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సమీపంలోని గుట్టకు నిప్పు పెట్టడంతో అక్కడి నుంచి వ్యాపించి మామిడి తోటకు అంటుకొని దాదాపుగా 40 వరకు చెట్లు కాలిపోయాయి. చెట్లకు 10 సంవత్సరాలకు పైబడి వయస్సు ఉందని.. మామిడి చెట్లను బతికించుకోవడానికి రూ.వేలు ఖర్చు పెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశానని తెలిపారు. పూతకు వచ్చిన దశలో నిప్పు పెట్టడంతో మొత్తం చెట్లు అన్ని కాలిపోయాయని వాపోయారు. అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి సహాయం అందజేయాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

వాల్మీకిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠలం గ్రామం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమా దంలో కురబలకోట మండలం అడవి పల్లెకు చెందిన శారద మృతి చెందిన విషయం విదితమే. అదే ప్రమాదంలో త్రీవంగా గాయపడిన ఆమె భర్త మాధవరెడ్డి బెంగళూరులో చికిత్స పొందు తూ సోమవారం ఉదయం మృతి చెందాడు. వాల్మీకిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పీలేరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుపులవేముల పంచాయతీ రెడ్డివారిపల్లె వద్దనున్న బస్టాప్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ గత రెండు రోజులుగా అదే బస్టాపులో ఉన్న అతను సోమవారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు సమాచారం అందించడంతో అతని మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించామని తెలిపారు. అతని గురించి తెలిసిన వారు తమకు 9440796744, 9440796745 నెంబర్లకు సమాచారం అందిం చాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రేమ పెళ్లి పేరుతో మోసం... యువకుడి అరెస్టు

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం వన్‌టౌన్ పరిధికి చెందిన ఓ యువతిని ప్రేమ పెళ్లి పేరుతో మోసం చేసిన యువకున్ని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. నంద్యాల జిల్లా దొర్లపాడు గ్రామానికి చెందిన గణేశ్ కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తుండేవాడు. అక్కడే పనిచేస్తున్న ఓ యువతిని ప్రేమ పెళ్లి పేరుతో శారీరకంగా వాడుకుని మోసం చేశాడు. ఈ మేరకు యువతి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి.. గణేశ్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

అదృశ్యమయ్యాడు.. ఆపై శవమై తేలాడు

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం రిమ్స్‌లో చికిత్స కోసం వచ్చి అక్కడ నుంచి అదృశ్యమై చివరికి శవమై తేలాడు. రిమ్స్ పోలీసుల వివరాల మేరకు.. ఆర్‌టీపీపీలో బాలాంజనేయులు (54) అనే వ్యక్తి ఉద్యోగిగా పనిచేసున్నాడు. ఈయన గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జనవరి 6న కడప రిమ్స్‌లో చేర్పించారు. మరుసటిరోజు 6వ తేదీ రాత్రి ఆసుపత్రి నుంచి బయటికి వెళ్లి అదృశ్యమయ్యాడు. జ్యోతి కెమికల్ సమీపంలోని పాడుబడ్డ లెట్రిన్ గుంత నుంచి దుర్వాసన రావటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి వెళ్లి పోలీసులు మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహానికి ఉన్న దుస్తుల ఆధారంగా బాలాంజనేయులు కుటుంబ సభ్యులను పిలిపించి వారు బాలాంజనేయులుగా గుర్తించారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. అయితే 6వ తేదీ మిస్సింగ్ అయిన బాలాంజనేయులు ఎక్కడెక్కడ తిరిగాడో, ఏమి అనేది పూర్తి వివరాలు తెలియడం లేదు. కుటుంబ సభ్యులు కూడా ఫిబ్రవరి 19న ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారించారు. సోమవారం ఆయన మృతదేహాన్ని గుర్తించారు. మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

విషద్రావణం తాగి వివాహిత ఆత్మహత్య

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఐటీఐ సర్కిల్ సమీపంలో ఉన్న ఓ వివాహిత తలకు పూసుకునే రంగు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. తాలుకా సీఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. ఐటీఐ సర్కిల్‌కు చెందిన సుభాన్‌బీ (22)కి నాలుగేళ్ల క్రితం చెన్నూరు మండలం ఓబులవారిపల్లెకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా కడప ఐటీఐ సమీపంలో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ నేపథ్యంలో మనస్థాపం చెందిన ఆమె ఆదివారం రాత్రి తలకు పూసుకునే రంగు తాగడంతో కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

కడప క్రైం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) :కడప నగరం ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న చెంద్రాయుడు (27) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిన్నచౌకు పోలీసుల వివరాల మేరకు.. కడప ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న చెంద్రాయుడు చిన్నచిన్న పనులు చేసుకుంటూ తల్లి వద్దనే ఉంటున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. బంధువుల వివరాల మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



పెండ్లిమర్రి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గంగనపల్లె గ్రామ దళితవాడలో మేరి (52) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మృతురాలి కూతురు నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ చల్లని దొర, ఎస్సైలు సిబ్బందితో కలసి పరిశీలంచారు.

కందులను దించుకోని వేర్‌హౌస్ అధికారులు

● నాలుగురోజులుగా ఇబ్బందులు పడుతున్నడ్రైవర్లు
● సరుకు సరిగా లేకపోవడంతో దించుకోలేదంటున్న అధికారులు


అనంతపురం జిల్లా నుంచి లారీల్లో తెచ్చిన విత్తన కందులను అన్‌లోడుచేయక నిలబడిన లారీలు

ప్రొద్దుటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో గల వేర్‌హౌస్‌గోడౌన్‌కు అనంతపురం జిల్లా రొద్దం నుంచి లారీల్లో వచ్చిన కందులను అధికారులు నాలుగు రోజులుగా దించుకోలేదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గోడౌన్ అధికారులతో లారీ డ్రైవర్లు వాగ్వాదానికి దిగారు. గత నాలుగు రోజులుగా లారీలు నిలబడి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే లేరన్నారు. దీనిపై వేర్ హౌస్ టెక్నికల్ సిబ్బంది 25 లారీల్లో కందుల విత్తనాలు వచ్చాయని.. 16 లారీల్లోని కందులు దించామన్నారు. తక్కిన లారీల్లో కందులు నాసిరకంగా ఉండటంతో అన్‌లోడ్ చేయలేమని తెలిపామన్నారు. రైతులకు అందజేయాల్సిన విత్తనాలు నాసిరకంగా ఉండటంతో దాదాపు 10 లారీల్లోని కందులను తిరిగి వెనక్కి పంపామని తెలిపారు.

రూ.10 లక్షలు చోరీ

సుండుపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాగంపల్లి గ్రామ పంచాయతీ కుంటలముందర సమీపంలోని గురప్పచెరువు వద్ద ఓ వ్యక్తి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు రూ.10 లక్షలు చోరీ చేశారు. పోలీసుల వివరాల మేరకు... సోమవారం రాత్రి భూమి కొనుగోలుకు నగదును బ్యాగులో తిసుకుపోతుండగా ముగ్గురు వ్యక్తులు అడ్డుకొని అపహరించినట్లు బాధితుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సంఘటనా స్థలానాకి చేరుకొని ఎస్ఐ శ్రీనివాసులు విచారణ చేస్తున్నట్లు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ తెలిపారు. ఇంకా కేసు నమోదు చేయలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలి


శ్మశానంలో నిరసన తెలుపుతున్న దళితులు

బి.కొత్తకోట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని మండలం లోని బడికాయలపల్లె ఎస్సీకాలనీ వాసులు కోరుతున్నారు. ఈ మేరకు శనివారం సం బంధిత స్థలంలో వారు నిరసన తెలిపారు. వా రు మాట్లాడుతూ బడి కాయలపల్లెలో వందకు పైగా ఎస్సీ కుటుంబాలు నివాసం వుంటూ కూలీ పనులతో జీవనం సాగిస్తున్నామని, సర్వేనెంబరు 513లో 0.32 సెంట్ల స్థలాన్ని కేటాయించారని, అయితే శ్మశానానికి వెళ్లేందుకు సరైన దారి ఏర్పాటు చేయకవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంద న్నారు. ఇదే విషయాన్ని పలుమార్లు ఎస్సీ ఎస్టీ మానటరింగ్ కమిటీ సమావేశాలలో ప్రస్తావించినా అధికారులలో చలనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సీ పెద్దలు నరసింహులు, వెంకటప్ప, రెడ్డెప్ప, శంకర, గంగప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో పసికందు మృతి

● వైద్యుని నిర్లక్ష్యం కారణమంటూ కుటుంబసభ్యుల ఆందోళన
● ఇన్‌ఫెక్షన్ల వల్ల మరణించాడని డాక్టర్ వివరణ


ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న పసికందు తల్లి బంధువులు

ప్రొద్దుటూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని గాంధీరోడ్డు పోసినా కాంపౌండులో వున్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పది రోజుల పసికందు చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు సరైన వైద్యం అందించక పోవడంతో మృతి చెందాడని బంధువులతో కలిసి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే...

జమ్మలమడుగు నియోజకవర్గం గండికోటకు చెందిన నాగేశ్వరి అనే మహిళ ఫిబ్రవరి 20న జమ్మలమడుగులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మగబిడ్డను ప్రసవించింది. ఆబిడ్డ ఏడుపు లేకుండా పుట్టడంతో పిల్లల వైద్య నిపు ణులకు చూపించమని అక్కడి వైద్యులు చెప్పడంతో ఫిబ్రవరి 21 న రాత్రి ప్రొద్దుటూరు గాంధీ రోడ్డులో గల చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పించారు. పిల్లల వైద్య నిపుణుడు మొదట రూ.25 వేల ప్యాకేజీ అడ్వాన్స్ కట్టించుకుని చికిత్స ప్రారం భించినట్టు తల్లిదండ్రులు తెలిపారు. 11 రోజుల పాటు బాలుడికి చికిత్స చేసి రూ.4లక్షలు వసూళ్లు చేసి ఆఖరికి బాలుడి మృతదే హాన్ని అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యలో వేరే చోటి కి వెళతామన్నా డాక్టర్ ఒప్పుకోలేదని తీరా విషమించాక కర్నూ లుకు తీసుకెళ్లమని చెప్పాడని బాలుడి తండ్రి గురుమోహన్ తెలి పారు. ఈ ఆందోళనక్రమంలో అదే ఆసుపత్రిలో తమ పిల్లలకు సరైన వైద్యం అందించకుండా లక్షలు వసూలు చేసి అనారోగ్యం బాగుచేయడం లేదన్నారు. దీంతో మా పిల్లలప్రాణాలు కాపాడు కోవడానికి వేరే ఆసుపత్రికి వెళ్ళి రక్షించుకున్నామని తెలిపారు. ఈ పసికందు మరణంపై డాక్టర్ లోకేశ్వర్‌ను వివరణ కోరగా 21 న రాత్రి బాలుడుని ఆసుపత్రికి తెచ్చారని.. పసికందుకు 10 రోజులు ఆసుపత్రిలో సక్రమంగా చికిత్స అందించామన్నారు. అయితే ఇన్‌పెక్షన్ వల్ల బీపీ పెరిగి గుండె వేగంగా కొట్టుకోవడం వలన ప్రాణాలు కాపాడలేకపోయామన్నారు.

చిత్రం చెప్పిన సమస్య

వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన విలేజ్ క్లినిక్ భవనాలు ఎంతమేరకు ఉపయోగంలో ఉన్నాయో ఈ చిత్రం చూస్తే అర్థమవుతుంది. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమీపంలో నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి శుభ్రత లేకుండా పోయింది. క్లినిక్‌కు ప్రజలు వచ్చే మాట ఎలా ఉన్నా అక్కడ పనిచేసే వైద్య సిబ్బంది అయినా సక్రమంగా వస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించి విలేజ్ హెల్త్ క్లినిక్ పట్ల చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

- వాల్మీకిపురం (ఆంధ్రజ్యోతి)



అశ్వవాహనంపై ఊరేగిన సిద్ధేశ్వరుడు



కలకడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కలకడ సత్యవతి నది తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా అందమైన ప్రభలతో అలంకరించిన వాహనంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఊరేగించారు. పాలఏకరి సంఘం ఆధ్వర్యంలో కోలాటాలు, చెక్కభజనలు, బాణాసంచా పేలుళ్లతో వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఊంజల్‌సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త రవీంద్రశర్మ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్లను అందచేస్తున్న ఐడిబీఐ బ్యాంకు మేనేజరు కోటేశ్వరరావు



పాఠశాలలకు కంప్యూటర్లు వితరణ

మదనపల్లె, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం సీటియం రోడ్డులోని ఐడిబీఐ బ్యాంక్ వారు సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి) నిధులతో ఐదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్లను వితరణ చేశారు. సోమవారం బ్యాంకు మేనేజరు కోటేశ్వరరావు, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు రూ.1.50లక్షల విలువ చేసే కంప్యూటర్లను పాఠశాలల హెచ్‌ఎంలకు కంప్యూటర్లను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐడిబీఐ బ్యాంకు వ్యాపార దృక్పథంలోనే కాకుండా సేవా రంగంలో కూడా ముందుంటుందన్నారు. విద్యార్థులు కంప్యూటర్లను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజరు శివకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో సరైన వసతులు కల్పించాలి

మదనపల్లె టౌన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా నిర్వహిస్తున్న జూనియర్, సీనియర్ ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో సరైన వసతులు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలిసి వినతిపత్రం అందించారు. పట్టణంలో 11 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తుండగా జిల్లా విద్యాశాఖ తప్పిదాలతో ఓ జూనియర్ కళాశాల చిరునామాను హాల్‌టికెట్లలో తప్పుగా ముద్రించారని, మరో కళాశాల కేంద్రంలో చీకటి గదుల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఇంకో జూనియర్ కళాశాల వద్ద పరీక్షల సమయంలో జీరాక్స్ సెంటర్లను తెరిచి వుంచుతున్నారని, రెండు పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదని, వైద్యసిబ్బంది కూడా హాజరు కాలేదని సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అఫ్రిది, జయబాబు, సమీర్, ప్రేమ్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీలేరులో 'ఉపాధి' తనిఖీ సభలు

పీలేరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై మంగళవారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు పీలేరు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. పీలేరు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం తనిఖీ బృందాలు, మండల స్థాయి అధికారులు, ఉపాధి సిబ్బంది సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి పంచాయతీలోనూ సామాజిక తనిఖీ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరిశీలిస్తారన్నారు. ఆయా గ్రామాల్లోని రైతులు, కూలీలు, మేట్లు, ప్రజాప్రతినిధులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తనిఖీ బృందాలకు సహకరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో అశోక్, పీఆర్ ఏఈ రాజు నాయక్, హౌసింగ్ ఏఈ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కలికిరిలో ప్రారంభమైన సామాజిక తనిఖీలు

కలికిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సోమవారం నుంచి సామాజిక తనిఖీలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు తనిఖీ బృందాలు ఆయా పంచాయతీలకు వెళ్లి పనులను పరిశీలిస్తున్నట్లు రాష్ట్ర రిసోర్స్ పర్సన్ డి.మురాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో సోమవారం పారపట్ల, పత్తేగడ, సంద్రావారిపల్లె పంచాయతీల్లో జరిగిన పనుల తనిఖీతో ప్రారంభించినట్లు చెప్పారు. ఈనెల 12 వరకూ అన్ని పంచాయతీల్లో తనిఖీలు చేస్తామని, అనంతరం 15వ తేదీన ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేదిక ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

ప్రత్యేక ప్రతిభావంతులకు లైసెన్సు మంజూరు చేయాలి

పీలేరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రభుత్వం మంజూరు చేసిన మూడు చక్రాల వాహనాలు నడుపుకునేందుకు వీలుగా లైసెన్సు మంజూరు చేయాలని ఆదర్శ వికలాంగుల సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు పీవీ చలపతి, కె.వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు సోమవారం పీలేరు ఎంవీఐ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న ప్రత్యేక ప్రతిభావంతులకు లైసెన్సులు త్వరగా వచ్చే విధంగా చూడాలని కోరారు. దరఖాస్తు చేసుకునేందుకు సదరం సర్టిఫికేట్, మొబైల్ నెంబరుతో లింక్ అయిన ఆధార్ కార్డు, విద్యార్హత సరిఫికేట్ వెంట తీసుకురావాలని వారు సూచించారు.

సునీల్‌కుమార్ సస్పెన్షన్ న్యాయ సూత్రాలకు విరుద్ధం

● బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు

మదనపల్లె అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్‌కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లారనే నెపంతో సునీల్‌కుమార్‌ను సెస్పెండ్ చేస్తున్నట్లు ప్రభుత్వం జారీ చేయడాన్ని ఆయన ఖండించారు. సునీల్‌కుమార తన సొంత ఖర్చులతో, వ్యక్తిగత హోదాలో అమెరికాలో ఉంటున్న ఆయన కుమారుడిని చూడటానికి వెళ్లారని, విదేశాలకు వెళ్లే హక్కు పూర్తి వ్యకిగతమని గతంలో ఐపీఎస్ అధికారి సతీష్‌చంద్ర వర్మ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆయన గుర్తు చేశారు. సునీల్‌కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేయడం కేవలం కుట్రపూరితమన్నారు. రాజకీయం అంటే అధికారులతో చెలగాటం కాదని, ప్రజలు ఇచ్చిన అధికారాలను దేశ, రాష్ట్ర ప్రజల అభివృద్ధికి వినియోగించాలని హితవు పలికారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, భానుప్రకాష్, లక్ష్మీనారాయణ, సయ్యద్, సాంబశివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి-జీవవైవిధ్యాన్ని సంరక్షించుకోవాలి

● జేవీవీ జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్

వాల్మీకిపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రకృతి, జీవ వైవిధ్యాన్ని సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం సందర్భంగా మండలంలోని గండబోయనపల్లె జడ్పీ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అంతరించిపోతున్న జంతువుల సంరక్షణ, మొక్కల పెంపకం తదితర వాటిపై అవగాహన కల్పించారు. అడవులను సంరక్షించడం, వన్య ప్రాణులను కాపాడటటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అలాగే స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమాలలో హెచ్‌ఎం రెడ్డిమోహన్, ప్రిన్సిపాల్ కల్పన, అటవీశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూలో.. మోసం

● నాసిరకం బెల్లం సరఫరా
● రాగిపిండి పరిమాణంలో కోత
● బెల్లం వాపసు చేస్తాం: ఎంఈవో



పాఠశాలలకు పంపిణీ చేసిన నాసిరకం బెల్లం

నిమ్మనపల్లి మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మన పిల్లలు..మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేస్తున్న రాగి జావ తయారీకి వినియోగించే పదార్థాలు నాసిరకంగా ఉండడంతో పలు పాఠశాలల్లో జావ పంపిణీని ఉపాధ్యాయులు నిలిపి వేశారు.

మండలంలో 57 పాఠశాలలు ఉండగా, ప్రతి నెల ప్రభుత్వం కోడిగుడ్లు, బెల్లం, రాగిపిండి, చిక్కీలు పంపిణీ చేస్తోంది. మార్చి నెలకు సంబంధించి మండలానికి 383 కేజీల బెల్లం, 383 కేజీల రాగిపిండి, 27, 363 చిక్కీలు, 54, 664 కోడ్డిగుడ్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటిలో బెల్లం నలుపు రంగులో తౌడును తలపిస్తోంది. రాగిపిండి కూడా ఇవ్వాల్సిన పరిమాణం కన్నా తక్కువ సరఫరా చేసినట్లు తెలిపారు. కొందరు డీలర్లు పంపిణీ చేసిన బెల్లంలో పురుగులు కూడా గుర్తించారు. వీటితో తయారు చేసిన రాగిజావను తాగేందుకు పిల్లలు కూడా ఇష్టపడడం లేదని వారు తెలిపారు. దీనిపై ఎంఈవో-2 నారాయణను వివరణ కోరగా, ఆయన డీలర్లు పంపిణీ చేసిన బెల్లం ప్యాకెట్లను పరిశీలించారు. మార్చి నెలలో పాఠశాలకు వచ్చిన బెల్లం నాసిరకంగా ఉందని దాని స్థానంలో వేరొకటి తెప్పిస్తామన్నారు.

'నవోదయం-2'ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

మదనపల్లె టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ వదిలేసి ప్రభుత్వం నవోదయం-2 పథకంతో ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నారమాకులతాండాలో నవోదయం-2 కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేయడం నేరమన్నారు. నాటుసారా తాగడం వలన అనారోగ్యం పాలై మృతి చెందుతారన్నారు. నాటుసారా తయారీని నిలిపివేసిన వారికి ప్రభుత్వం నవోదయం-2 పథకం ద్వారా అందించ రుణాలను సద్వినియోగం చేసుకుని తలెత్తుకుని బతకాలన్నారు. ఎక్సైజ్ ఈఎస్ మధుసూదన్ మాట్లాడుతూ నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు చేసేవారిపై ఆరు నెలల్లో మూడుసార్లు పట్టుబడితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం నాటుసారా నిషేధం, నవోదయం-2 పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఈఎస్ జోగేంద్ర, సీఐ భీమలింగ, తాలూకా సీఐ కళా వెంకటరమణ, తహసీల్దార్ ధనంజయులు, ఎంపీడీవో తాజ్‌మస్రూర్ తదితరులు పాల్గొన్నారు.



నవోదయం-2 పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు



బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

పీలేరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సమాజం నుంచి బాల్య వివాహాలను పూర్తిగా రూపుమాపేందుకు అందరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో రాజమ్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ సఖీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం పీలేరులోని ఐసీడీఎస్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు బాల్య వివాహాల వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల కారణంగా బాలికల్లో శారీరక, మానసిక అనారోగ్య సమస్యలతో పాటు కుటుంబాల విచ్ఛిన్నానికి దారి తీస్తుందన్నారు. సరైన వివాహ వయస్సు వచ్చే వరకు బాలికలకు వివాహం చేయరాదన్నారు. అనంతరం వెలుగు కార్యాలయంలో బాల్యవివాహాల నిర్మూలనకు డ్వాక్రా మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీఎం జవహర్ బాషా, సూపర్‌వైజర్లు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడ్డ నాయకులకే పదవులు ఇవ్వాలి

బి.కొత్తకోట, మార్చి 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ దౌర్జన్య కాలంలో కష్టపడి పార్టీ కోసం నిలబడ్డ టీడీపీ నాయకులకే నామినేటెడ్ పదవులు, మండల, గ్రామపార్టీ బాధ్యతలు అప్పగించాలని టీడీపీ మండల కార్యవర్గం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. మండల పార్టీ అధ్యక్షుడు నారాయణస్వామిరెడ్డి అధ్యక్షతన సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ అధికారంలో పెత్తనం చెలాయించిన వారే టీడీపీలో చేరి మళ్లీ అధికారం చెలాయిస్తున్నారని, వారికి అడ్డుకట్ట వేయాలని కోరారు. సింగిల్‌విండో త్రీమెన్‌కమిటీ, మార్కెట్‌కమిటీ, ఆలయకమిటీలు, పార్టీ అనుబంధ విభాగాలలో నిజమైన కార్యకర్తలకు అవకాశం ఇవ్వాలని తీర్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పోల్‌మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు, నాయకులు బంగారు వెంకట్రమణ, కనకంటిప్రసాద్, దేవరింటికుమార్, సుదర్శన్‌రెడ్డి, సమీవుల్లా, సురేంద్ర, రాజా, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మిట్స్‌లో యుఎస్ఏ రివియర్ యూనివర్సిటీ ప్రతినిధులు

కురబలకోట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలో ఉన్న మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలను యుఎస్ఏ రివియర్ యూనివర్సిటీ స్ట్రాటజిక్ గ్లోబల్ ఎంగేజ్మెంట్ డైరెక్టర్ బారిగాడే సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. ఆదివారం కళాశాలలో ఆ యూనివర్సిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంస్థల మధ్య విద్యాసహకారాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శిక్షణా నియామకాల అధిపతి వేణు చౌదరి, డీన్ శ్రీమంత్ బసు, ఇంటర్నేషనల్ రిలేషన్ మేనేజర్ విజయక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు మంజూరు

మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులకు సీతారామ్ జిందాల్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్పులు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలో ఎంసీఏ విభాగాలకు చెందిన 20 మంది విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్పులు మంజూరయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, తదితరులు అభినందించారు.



యుఎస్ఏ రివియర్ యూనివర్సిటీ డైరెక్టర్ బారిగాడేను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ తదితరులు

ఉమెన్ హెల్ప్ డెస్క్‌పై అవగాహన ఉండాలి

● ఎస్ఐ చంద్రశేఖర్

వాల్మీకిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చట్టం, న్యాయం పట్ల ముఖ్యంగా ఉమెన్ హెల్ప్ డెస్క్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చెడు మార్గాలతో భవిష్యత్తును నాశనం చేసుకోరాదన్నారు. మహిళలు, బాలికలు సాధారణ ఫిర్యాదుల కోసం 181, 100, 112, 1098నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. క్రమశిక్షణతో, తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ కార్యాలయం, జైలు గదులు, ఆయుధాల ఉపయోగం గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఏఎస్ఐ కరీముల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ చంద్రశేఖర్

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

పెద్దతిప్పసముద్రం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై విద్యార్థినులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ హరిహర ప్రసాద్ పెర్కొన్నారు. మార్చి 8వ తేదీన జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడంలో పురుషుల ప్రమేయం యొక్క ఆవశ్యకత, పితృస్వామ్య నిబంధనలను సవాల్ చేయడం గురించి సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి అనంతరం స్థానిక బస్టాండు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, మహిళల ప్రాదాన్యతపై విద్యార్థినులకు ఆయన అవగాహన కల్పించారు.

వాలీశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.1.69 లక్షలు

రామసముద్రం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.నడింపల్లె పంచాయతీ బలసముద్రం కొండపై వెలసిన పురాతన వాలీశ్వరాలయం హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఆలయ ఈవో రమణ, ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ద్వారా రూ.1,69,318 ఆదాయం వచ్చినట్లు ఈవో రమణ తెలిపారు. ఆలయ భూములు సుమారు వంద ఎకరాలకు పైబడి ఉన్నాయని, వీటికి కూడా త్వరలోనే వేలంపాటు నిర్వహించి లీజుకు ఇచ్చే విషయంపై చర్చిస్తున్నామన్నారు. కాగా ఈ ఏడాది హుండీ ఆదాయ, వ్యయాలపై సమగ్ర విచారణ జరిపించాలని కమిటీ సభ్యులు ఈవోను కోరారు.



ఆలయ హుండీని లెక్కిస్తున్న దృశ్యం

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 8వ తేదీన వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జడ్జి గురు అరవింద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కోర్టులో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులతో జీవితాలను దుర్భరం చేసుకుండా కక్షిదారులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

23న తిరుపతిలో మాలల సింహ గర్జన

కలికిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న తిరుపతిలో జరిగే మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు అధికార ప్రతినిధి హరి కోరారు. ఈ సందర్భంగా సోమవారం మర్రికుంటపల్లె పంచాయతీ పాత దళితవాడలో ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రమేశ్‌బాబు, సహదేవ, గురు, రామచంద్ర, రెడ్డెప్ప, గంగాధర, గిరి, సురేష్, వెంకటస్వామి, శ్రీనివాసులు, విజ య్, కృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ వేడుకను విజయవంతం చేయండి

తంబళ్లపల్లె, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవ వేడుక సభకు నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ పిలుపుని చ్చారు. సోమవారం ఆయన స్థానిక జనసేన నేతలతో కలసి తంబళ్లపల్లె మల్లయ్య కొండ మల్లికార్జునస్వామిని దర్శించుకుని అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎద్దుల నరసింహులు, సురేష్, రఘు, మల్లికార్జున, దామోదర్, నాగరాజు, నాగేంద్ర, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

మదనపల్లె అర్బన్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12న వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలోని కొండామర్రిపల్లె, బోడుమళ్లదిన్నె, బెస్తపల్లె, పోతబోలు, ఎనుములవారిపల్లె, చిలకవారిపల్లె గ్రామాల్లోని ఉపాధి పని ప్రాంతాల్లో కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంద రోజుల ఉపాధి పని పూర్తి చేసుకున్న పేదలకు అదనంగా మరో వందరోజుల పనిదినాలు, ఉపాధి కూలి రూ.600, సమ్మర్ అలవెన్స్ పేస్లిప్పులు ఇవ్వాలన్నారు. వలస కార్మికులకు ఉచిత రవాణా సౌకర్యం, బియ్యం, గ్యాస్ సిలిండర్ అందివ్వాలని, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబసభ్యులకు రెండెకరాల భూమి, 3సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో హరిశర్మ, రఘునాథ్, సుధాకర్, భూదేవి పాల్గొన్నారు.

ములకలచెరువులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి... భారీ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు





ఘనంగా జయచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు

● ములకలచెరువులో భారీ ర్యాలీ.. కేక్ కటింగ్

ములకలచెరువు/పెద్దమండ్యం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువులో సోమవారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి జన్మదిన వేడుకలు అంబరాన్నంటాయి. తొలుత వినాయనగర్‌లోని నియోజకర్గ పార్టీ కార్యాలయం నుంచి బస్టాండు సర్కిల్ వరకు ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. తరలివచ్చిన టీడీపీ శ్రేణుల మధ్య బస్టాం డు సర్కిల్‌లో జయచంద్రారెడ్డి కేక్‌ను కట్ చేశారు. అనంతరం బస్టాండు సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండు, పెట్రోల్ బంకు మీదుగా కేజీఎన్ కళ్యాణమండపం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అక్కడ నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు అధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేశ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, కురబలకోట, తంబళ్లపల్లె మండలాల అధ్యక్షులు వైజీ సురేంద్రయాదవ్, రెడ్డెప్పరెడ్డి, కట్టా హరి, చాంద్‌బాషా, కేశవ రెడ్డి,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో..

మండలంలోని పెద్దమండ్యం, దిగువపల్లి గ్రామాల్లో జయచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకలను టీడీపీ మండల నేతలు ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ మండల నేతలు బండి యుగం ధర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కుంటకిందపల్లి చంద్రా రెడ్డి, గల్లా నారాయణ, విశ్వనాధరెడ్డి, సిద్దవ రం ప్రసాద్, చల్లపల్లె వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు ములకలచెరువులో జయచంద్రారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

